క్లుప్తంగా

నాణ్యమైన విద్యను అందించాలి



పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరిసరాలను పరిశీలిస్తున్న డాక్టర్ శోభారాణి

తొండంగి: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని కళాశాల విద్య ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ ఎస్.శోభారాణి సూచించారు. మండలంలోని కె. పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల రికార్డులు, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో వేర్వేరుగా మాట్లాడి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తానని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీకే మెహర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.దివాకర్‌రావు, పీవీ కృష్ణారావు, ఎం.మహలక్ష్మీనాయుడు, టి.రాము, ఎం.నాగేశ్వరరావు, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై నేడు రథసప్తమి వేడుకలు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో మంగళవారం ఉదయం 8.30 గంటలకు రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. సత్యదేవుని వార్షిక కల్యాణ వేదిక మీద సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు, వివిధ భంగిమల్లో నమస్కారాలు చేస్తామన్నారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

సంపద కేంద్రాల పరిశీలన



మల్లేపల్లిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ బుజ్జి

గండేపల్లి: పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ నాతి బుజ్జి సూచించారు. మండలంలోని గండేపల్లి, మల్లేపల్లి గ్రామాలలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుద్ధ్యం మెరుగుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి వర్మీ కంపోస్ట్ తయారు చేయాలన్నారు. ప్రతి గురువారం కంపోస్ట్ విక్రయించాలని సూచించారు. ఆమె వెంట ఏఓ చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



వర్క్‌షాప్‌లో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

గండేపల్లి: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, తమను తాము మెరుగు పరుచుకోవాలని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు సూచించారు. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో వెబ్ ఇన్నోవేషన్ విత్ డిజైన్ థింకింగ్ అనే అంశంపై మూడు రోజుల పాటు జరిగే వర్క్‌షాప్‌లో మొదటి రోజు సోమవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకునేందుకు ఇటువంటి వర్క్‌షాపులు దోహదపడతాయన్నారు. బ్రెయినోవిజన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అకాడమీకి చెందిన నారాయణస్వామి, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ విభాగాధికారి కె.లక్ష్మివివేక సాంకేతికపై ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం



కత్తిపూడిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని కత్తిపూడి సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో సోమవారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

తునిలో టెన్షన్ టెన్షన్

- మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికలో టీడీపీ గుండాగిరి
- వైఎస్సార్ సీపీ శ్రేణులను రెచ్చగొట్టే యత్నం
- కౌన్సిల్ హాలులోకి వెళ్లి రగడ



తుని మున్సిపల్ కార్యాలయం గేటు వద్ద గుమిగూడిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

తుని: మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికతో తునిలో టెన్షన్ వాతావరణం చోటు చేసుకుంది. వైఎస్సార్ సీపీకి పూర్తి స్థాయి మెజార్టీ ఉన్నా టీడీపీ నాయకులు గలాట సృష్టించారు. సోమవారం ఉదయం మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక కోసం వైఎస్సార్ సీపీకి చెందిన 24 మంది కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. పోలీసుల భారీగా మోహరించి కౌన్సిలర్లను లోపలికి రాకుండా గేటు మూసి వేశారు. దీంతో కౌన్సిలర్లు పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇదే సమయంలో టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు భారీగా గేటు వద్దకు చేరుకుని వైఎస్సార్ సీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులను రెచ్చగొట్టేందుకు యత్నించారు. టీడీపీ వ్యూహాన్ని గమనించిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు సమయనం పాటించారు. దీంతో మున్సిపల్ కార్యాలయం వద్ద టెన్షన్ వాతావరణం చోటు చేసుకుంది.

మున్సిపల్ కార్యాలయంలోకి టీడీపీ శ్రేణులు

తుని మున్సిపల్ ఎన్నికల్లో 30కి 30 వార్డులను వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు గెలుచుకున్నారు. ఇందులో 5వ వార్డు కౌన్సిలర్ మర్రా సత్యవతి అనారోగ్యంతో మృతి చెందగా 11వ వార్డు కౌన్సిలర్ ఆరుగుల రవికుమార్‌కు ఉద్యోగం రావడంతో రాజీనామా చేశారు. మరో కౌన్సిలర్ నార్ల భవన సుందరి వైఎస్సార్ సీపీని వీడి టీడీపీలో చేరారు. మిగిలిన 27 మంది కౌన్సిలర్లు వైఎస్సార్ సీపీలో ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో రెండో మున్సిపల్ వైస్ చైర్మన్‌ను ప్రకటించగా పామర్తి మహేష్ రెండేళ్ల పాటు వైస్ చైర్మన్‌గా కొనసాగారు. ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం పామర్తి మహేష్ పదవి నుంచి తొలిగారు. దీంతో ఇటీవల మున్సిపల్ వైస్ చైర్మన్ పదవికి నోటిఫికేషన్ విడుదల చేశారు. సోమవారం ఉదయం 11 గంటలకు వైస్ చైర్మన్ ఎన్నిక జరగాల్సి ఉంది. అనూహ్యంగా టీడీపీకి చెందిన నాయకులు రావడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఉదయం 11.15 గంటలకు గేటు తీయడంతో అనుమతి లేకపోయినా టీడీపీ శ్రేణులు కౌన్సిల్ హాలులోకి వెళ్లి కౌన్సిలర్ల సీట్లలో కూర్చున్నారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇంత జరిగినా అధికారులు కౌన్సిల్ హాలులో పరిస్థితిని అదుపు చేయలేదు. దీంతో వైఎస్సార్ సీపీకి చెందిన కౌన్సిలర్లు కౌన్సిల్ హాలు నుంచి బయటకు వచ్చేశారు.

అనుమతి లేకుండా...

మున్సిపల్ కౌన్సిల్ హాలులోకి అనుమతి లేకుండా బయట వ్యక్తులను ఎలా అనుమతించారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి ప్రశ్నించారు. అధికారులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య వ్యవస్థకు విరుద్ధమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- తంటికొండలో స్వామివారికి విశేష పూజలు
- దర్శనానికి పోటెత్తిన భక్తులు



తంటికొండలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు, భక్తులు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి 65వ దివ్య బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు ఆలయ ప్రదక్షిణ, స్వస్తివాచనం, స్వామివారి పాదసేవ, హారతి, సంకల్పంతో బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, ఋత్విక్‌వరుణ, దీక్షారాధన, అకల్మష కూష్మాండ హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. మధ్యాహ్నం గ్రామానికి చెందిన బద్దిరెడ్డి వెంకయ్యమ్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా దేవస్థానం మాజీ చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర, ఈఓ వడ్డాది సత్యన్నారాయణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

నేడు రథసప్తమి వేడుకలు

బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు మంగళవారం ఆలయంలో రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నారు. గ్రామస్తులు, భక్తులతో సామూహికంగా పాలు పొంగించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. అలాగే స్వామి వారికి శాంతి కల్యాణం, హోమం, లక్షతులసీ పూజ వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అవకతవకలపై విచారణ జరిపించాలి



గోకవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతుకూలీ సంఘం నాయకులు, సభ్యులు

గోకవరం: మండలంలోని శివరామపట్నంలో రీసర్వేలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం గోకవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ శివరామపట్నంలో సర్వే నంబర్ 4/1, 34/1, 35/2సి, 36/2ఎలో సుమారు 36.39 ఎకరాల సీలింగ్ భూమిని అదే గ్రామానికి చెందిన నిరుపేదలు గత 20 ఏళ్లుగా సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారన్నారు. గతేడాది జరిగిన రీసర్వేలో ఆన్‌లైన్‌లో వేరే వాళ్ల పేర్లను నమోదు చేశారని, సర్వే తప్పులతడకగా ఉందని ఆరోపించారు. తక్షణమే ఈ అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి, 20 ఏళ్లుగా సాగులో ఉన్న నిరుపేదల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసి భూమిపై హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.రాజబాబు, బి.రమేష్, నాయకులు కె.రామలింగేశ్వరరావు, డి.సురేష్, జాన్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

‘సూపర్ సిక్స్’ అమలు అసాధ్యం

- అసెంబ్లీ సాక్షిగా తేల్చేసిన చంద్రబాబు
- ప్రభుత్వ వైఫల్యాలపై ధ్వజమెత్తిన మాజీ మంత్రి తోట నరసింహం



జగ్గంపేటలో విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ మంత్రి తోట నరసింహం

జగ్గంపేట: సంక్షేమ పథకాలు అమలు చేయలేమని, సూపర్ సిక్స్ అమలు సాధ్యం కాదని రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తేల్చి చెప్పేశారని, ఇది ప్రజలను నమ్మించి మోసం చేయడమేనని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోటనరసింహం అన్నారు. జగ్గంపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నేడు వాటిని అమలు చేయలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకు మైండ్ గేమ్ ఆడుతున్నారని విమర్శించారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ హామీల అమలు సాధ్యం కాదని ఎన్నికల ముందు తెలియదా ? అని ప్రశ్నించారు. కేవలం ఏడు నెలల కాలంలోనే చంద్రబాబు 1.50 లక్షల కోట్లు అప్పు చేశారని తెలిపారు. దీంతో రాష్ట్రంలో ఏ సంపద సృష్టించారో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్యాలెండర్ ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. కూటమి నేతలు ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారో తక్షణమే తేదీలతో సహా వెల్లడించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు, జగ్గంపేట మండల అధ్యక్షుడు రావుల గణేష్ రాజా, జగ్గంపేట టౌన్ అధ్యక్షులు కాపారపు ప్రసాద్, పార్టీ నాయకులు తులా రాము, కరుటూరి వీర్రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రౌతులపూడి: వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించే దిశగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని బీజేపీ కాకినాడ జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. సోమవారం రౌతులపూడిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఉపాధి హామీ పథకంలో భాగంగా 35 పనులకు గాను రూ.10 కోట్లు కేంద్రం వెచ్చించిందన్నారు. వీటిలో సబ్‌ప్లాన్ ఏజెన్సీలో రహదారులు, సీసీ రోడ్లు నిర్మాణాలకు రూ.2.4 కోట్లు కేటాయించి పనులు చేపట్టినట్టు ఆయన వివరించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పన్నుల రాయితీ సామాన్యులకు ఎంతో మేలు చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు లవుడు శ్రీనివాస్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముద్రగడ ఇంటిపై దాడి ప్రభుత్వ వైఫల్యమే

- ఖండించిన వైఎస్సార్ సీపీ నాయకులు
- నియోజకవర్గంలో దాడికి నిరసనగా సమావేశాలు



ఏలేశ్వరంలో దాడిని ఖండిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ప్రత్తిపాడులో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇంటిపై దాడి ఘటనలో ప్రభుత్వ వైఫల్యం కనిపిస్తోందని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఇంటిపై శనివారం జరిగిన దాడికి నిరసనగా నియోజకవర్గంలోని అన్నిమండలాల్లో పార్టీ శ్రేణులు సమావేశాలు నిర్వహించారు. దాడిని ముక్తకంఠంతో ఖండించారు. ఏలేశ్వరంలో మున్సిపల్ కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు ఇంటి వద్ద అర్బన్, రూరల్ పరిధిలోని పార్టీ కమిటీలు సమావేశమై దాడిని ఖండించాయి. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం కావడంతో ప్రజల దృష్టిని మళ్లించేందుకు వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులు చేయడం పరిపాటిగా మారిందన్నారు. దీనిలో భాగంగానే ముద్రగడ ఇంటిపై దాడి చేశారన్నారు. ఈ నెల 5న జరిగే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆందోళనను భగ్నం చేసేందుకే ముద్రగడలో ఇంట్లపై దాడి చేశారన్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ తన కార్యకర్తలను అదుపులో ఉంచుకోవాలన్నారు. లేకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. దాడి నేపథ్యంలో పవన్ కల్యాణ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బదిరెడ్డి గోవిందు, గొల్లపల్లి సురేష్, సుంకర రాంబాబు, పైల విజయ్‌కుమార్, యిజనగిరి ప్రసాద్, గొల్లపల్లి కాశీవిశ్వనాథ్, వాగుబలరామ్, తదితరులు పాల్గొన్నారు.

రెడ్ బుక్ రాజ్యాంగంలో భాగంగానే...

రౌతులపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం నివాసంపై దాడి ముమ్మాటికీ రెడ్ బుక్ రాజ్యాంగం అమలులో భాగమేనని మండల వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. ముద్రగడ నివాసంపై దాడిని ఖండిస్తూ సోమవారం పార్టీ నేత వాసిరెడ్డి జమీలు ఆధ్వర్యంలో రౌతులపూడిలో మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఇంకా అరాచక పాలన కొనసాగుతోందని ఆరోపించారు. రాజ్యాంగ బద్ధంగా వచ్చిన అధికారాన్ని ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి ఉపయోగించాలన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులే లక్ష్యంగా అరాచక పాలన సాగిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. రాష్ట్రంలో ఎక్కడికక్కడ దాడులు జరుగుతుంటే పోలీసులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ముద్రగడ ఇంటిపై దాడికి పాల్పడిన వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇకనైనా రెడ్‌బుక్ రాజ్యాంగానికి స్వస్తిపలికి పాలనపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎస్.సాయి, వాసిరెడ్డి భాస్కరబాబు, సీహెచ్‌వీవీ సత్యనారాయణ, సర్పంచులు సర్పం శ్రీను, వడ్ల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కాకి నాని, సోమరౌతు తిరుమల వెంకన్నదొర, పోలుపర్తి తాతాజీ, రాయి ప్రసాద్, గొల్లు వెంకటరమణ, అంకంరెడ్డి సతీష్, పక్కుర్తి జయబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో..

ప్రత్తిపాడు: వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇంటిపై జరిగిన దాడిని మండల వైఎస్సార్ సీపీ శ్రేణులు ముక్తకంఠంతో ఖండించాయి. స్థానిక సరయు కన్వెన్షన్ హాలులో సోమవారం పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈ దాడి జరిగిందన్నారు. మెట్ట ప్రాంతంలో ఇప్పటివరకు ఇటువంటి చిల్లర రాజకీయాలు లేవన్నారు. టీడీపీ అనుసరిస్తున్న రెడ్ బుక్ రాజ్యాంగంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనతి కాలంలోనే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే రీతిలో పాలన సాగించడం సమంజసం కాదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచీ వైఎస్సార్ సీపీ కేడర్‌పై దాడులు, వేధింపులకు తెగబడ్డారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయన్నారు. ఈ దాడిని పక్కదోవ పట్టించేందుకు నిందితుడు మతిస్థిమితం లేని వాడని బుకాయింపు ధోరణిలో కూటమి నేతలు ఉన్నారన్నారు. ఇదే పంథా అవలంబిస్తే ప్రజలు తిరగబడే పరిస్థితులొస్తాయని హితవు పలికారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టి, వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, ఎంపీటీసీలు సీంద్రపు భాస్కరరావు, పిల్లా చిన్నా, అమరాది కాశీ, సర్పంచ్ గోనగాల అప్పలరాజు, పార్టీ నాయకులు బెహరా దొరబాబు, గుడాల వెంకటరత్నం, శేరు కృష్ణ, జల్లిగంపల ప్రభాకరరావు, దాడిశెట్టి చక్రధర్, గోళ్ల జయశేఖర్, జువ్వల బాబులు, అన్నవరం ట్రస్ట్‌బోర్డు మెంబర్ దోశే చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



రౌతులపూడిలో విలేకర్లతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

విద్యతోనే సకల సంపదలు

- శ్రీరమణా సేవాశ్రమం పీఠాధిపతి స్వామి రామానంద
- వైభవంగా వసంత పంచమి వేడుకలు



ఒమ్మంగిలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు

ప్రత్తిపాడు రూరల్: విద్యతోనే జ్ఞానం, సకల సంపదలు సిద్ధిస్తాయని శ్రీరమణా సేవాశ్రమం పీఠాధిపతి స్వామి రామానంద అన్నారు. మండలంలోని ఒమ్మంగిలోని శ్రీభారతి విద్యాసంస్థల ప్రాంగాణంలో సోమవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీగణపతి హోమం, సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. ఈ సందర్భంగా స్వామీరామానంద మాట్లాడుతూ విద్యాలయాల్లో విలువ ఆధారిత బోధన చేయాలన్నారు. సమాజ హితానికి పాటుపడే పౌరులను అందించాలన్నారు. మండలంలోని ఒమ్మంగి శ్రీభారతి విద్యానికేతన్, ఉత్తరకంచి ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో వసంత పంచిమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాలు చేయించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శ్రీభారతి విద్యాసంస్థల అధినేత సుంకర వీరబాబు, ఆక్స్‌ఫర్డు స్కూల్ నిర్వాహకులు రామిశెట్టి తాతారావు, రామిశెట్టి రాంబాబు, గంగధర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయంలో సోమవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. చిన్నారులతో ప్రత్యేక పూజలు చేయించారు. సుమారు 50 మంది చిన్నారులకు అక్ష్యరాభ్యాసాలు చేయించినట్టు అర్చకుడు డాక్టర్ జగన్నాథశర్మ తెలిపారు.

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో వసంత పంచమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. సరస్వతీదేవికి విద్యార్థులు వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు వసంత పంచమి విశిష్టతను వివరించారు. అనంతరం తలుపులమ్మ దేవస్థానంలో జరిగిన సరస్వతీదేవి పూజల్లో తమ విద్యార్థులు పాల్గొన్నట్లు యాజమాన్యం తెలిపింది. పట్టణంలోని పలు ప్రభుత్వ, గురుకుల పాఠశాలల్లో సరస్వతీ పూజ నిర్వహించి విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: వసంత పంచమిని పురస్కరించుకుని సోమవారం మండలంలోని పలు పాఠశాలల్లో సామూహిక అక్షరాభాస్యాలు నిర్వహించారు. స్థానిక ఏఎస్ఎల్, విజ్ఞాన భారతి, ఎస్ఎల్వీ, ఉమర్ ఆలీషా ఇంగ్లిషు మీడియం పాఠశాలల్లో సరస్వతీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు.

ప్రత్తిపాడు: వసంత పంచమిని పురస్కరించుకుని సోమవారం స్థానిక అఖిల్ పాఠశాల ఆవరణలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. తొలుత పండితులు సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్తిపాడు, రాచపల్లి, ఒమ్మంగి, ధర్మవరం, సిరిపురం, చిన్నింపేట గ్రామాలకు చెందిన సుమారు వంద మంది దంపతులు సరస్వతీదేవికి సహస్రనామార్చన, కుంకుమార్చనలు నిర్వహించారు. తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అఖిల్ కరస్పాండెంట్ ఇనకోటి గంగాధర్, ఉపాధ్యాయులు లత, శ్రీనివాస్, సునీత, దివ్య తదితరులు పాల్గొన్నారు.

తొండంగి: మండలంలోని తొండంగి, కొత్త పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూళ్లలో సోమవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సరస్వతీదేవికి విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. పెరుమాళ్లపురంలో 10వ తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరుతూ తొమ్మిదో తరగతి విద్యార్థులు వారికి పెన్నులు బహూకరించారు. ఎస్ఎంసీ చైర్మన్ బద్ది రాంబాబు, హెచ్‌ఎం చాత్రాతి సత్యనారాయణ చేతుల మీదుగా వీటిని విద్యార్థులకు అందజేశారు.



వసంత పంచమి వేడుకల్లో ప్రసంగిస్తున్న ఆధ్యాత్మికవేత్త స్వామి రామానంద



తుని శ్రీప్రకాష్‌లో సరస్వతీదేవికి పూజలు చేస్తున్న విద్యార్థులు



ఉత్తరకంచి ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం



ప్రత్తిపాడులో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు